**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 22.03.2026** **సమయం : 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. అన్నదాతల సంక్షేమం, వారి అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు .
2. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.
3. ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తోందని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి వెల్లడించారు.
4. రాష్ట్రంలో ఈ రోజు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

.....................................................................

**రైతు భరోసా**

అన్నదాతల సంక్షేమం, వారి అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 70 లక్షల మంది రైతులకు 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు విడుదల చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సిద్దిపేట జిల్లాలో పర్యటిస్తారు. నంగునూరు మండలం నర్మెట్టలో

సుమారు 300 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన తెలంగాణ ఆయిల్ ఫామ్ కర్మాగారాన్ని ఆయన ప్రారంభిస్తారు. అలాగే రైతు ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. నర్మేట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అనంతరం రైతు భరోసా నిధుల పంపిణీని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఎకరానికి 6వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం నేటి నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది.

........డెస్క్

**వాణిజ్య సిలిండర్లు**

రేపటి నుంచి వాణిజ్య సిలిండర్ల సరఫరాను మరింత విస్తరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 20 శాతం మేర ఈ సిలిండర్ల సరఫరాను పెంచి హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాంటీన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని డీలర్లకు సూచించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది.

.......డెస్క్

**తుమ్మల**

గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుతం ఆర్థికంగా రాష్ట్రం సంకట స్థితిని ఎదుర్కొంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గత ప్రభుత్వం 8 లక్షల 50 వేల కోట్ల రూపాయలు అప్పు చేసిందని, ఆ అప్పు వల్ల ప్రస్తుతం 7 వేల కోట్ల రూపాయలు అసలు, వడ్డీలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని ఆయన అన్నారు. తెలంగాణను దేశంలోనే ఆయిల్ ఫామ్ హబ్ గా మార్చడం తమ ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు అధిక ఆదాయాన్నిచ్చే ఈ పంటను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో తెలంగాణ వ్యాప్తంగా విస్తరింప చేస్తామన్నారు. ఒక్కసారి నాటితే 25 నుంచి 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం ఆయిల్ ఫామ్ వల్ల రైతులకు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

.......డెస్క్

**బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు**

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయటమే తమ ప్రభుత్వ లక్ష్యమని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. జలవనరులతో నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడంతో పాటు జిల్లాకు సాగునీటి సమస్య లేకుండా రైతులకు అండగా నిలుస్తామని మంత్రి పేర్కొన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా నల్లగొండ నియోజక వర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందించి సస్యశ్యామలం చేస్తామని ఆయన అన్నారు. అలాగే పలు గ్రామాలకు సాగు నీరందించే వివిధ పంట కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు..బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా భూగర్భజాలాలు పెరగడంతో పాటు కాలుల ద్వారా గ్రామంలో ప్రతి చెరువును నింపడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు.

పీటీసీ నల్లగొండ జిల్లా..........

**వివేక్ వెంకటస్వామి**

ప్రజలకు అత్యవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఈ రోజు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఈ రోజు పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో 2 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులకు, కోటి 80 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గారితో కలిసి మంత్రి ప్రారంభించారు.

**సౌండ్ బైట్...మంత్రి వివేక్ వెంకటస్వామి.**

పీటీసీ మంచిర్యాల జిల్లా...

**ప్రపంచ జల దినోత్సవం**

ఈరోజు ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మంచినీటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ మంచినీటి వనరుల స్థిరమైన నిర్వహణ గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 22వ తేదీని ప్రపంచ జల దినోత్సవంగా పరిగణిస్తున్నారు. 1992 సంవత్సరంలో బ్రెజిల్ లోని రియో డి జెనీరోలో పర్యావరణం అభివృద్ధి పై ఐక్య సమితి ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ జల దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని ప్రతిపాదన చేశారు. 1993 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మార్చి 22 ను ప్రపంచ జల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

........డెస్క్

ప్రపంచ జల దినోత్సవం

భూమి లోపల నీటి నిల్వను పెంచే విధంగా ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ఆసిఫాబాద్ జిల్లా ఫారెస్ట్ అధికారి నీరజ్ కుమార్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యానిలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

**జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ వాయిస్ బైట్**

.......ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

**వరంగల్ – జల దినోత్సవం**

ప్రకృతి మనకు ప్రసాదించిన వనరులలో నీరు అత్యంత ముఖ్యమైనదని, నీటిని వృధా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి తెలిపారు. నేడు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా తాగునీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జల సంరక్షణ పైన ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి

మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది కూడా పనిచేయాలని సూచించారు. ఇంకుడు గుంతలతో వర్షపు నీటిని నిలువ చేసుకునేలా నగరవాసులను ప్రోత్సహించాలన్నారు.

...వరంగల్ జిల్లా పిటిసి

**జల సంరక్షణ**

జలాల సంరక్షణ ద్వారా సమగ్ర ప్రగతిని సాధించవచ్చని, నీటిని సద్వినియోగం చేసుకొని భావితరాలకు మేలైన భవిష్యత్తును అందించాలని నిర్మల్ జిల్లా భూగర్భ జల జిల్లా అధికారి శ్రీనివాస్ బాబు అన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి ఇంకుడు గుంత, ప్రతి రైతు ఎకరంలో ఫాంఫండ్ నిర్మిస్తే వర్షాకాలంలో నీరు భూమి లోకి వెళ్లి భవిష్యత్తులో నీటి ఇబ్బందులు తలెత్తకుండా భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ రోజు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఆయన ఆకాశవాణి తో మాట్లాడుతూ....

**నిర్మల్ జిల్లా భూగర్భ జల జిల్లా అధికారి శ్రీనివాస్ బాబు సౌండ్ బైట్**

.......పిటిసి నిర్మల్ జిల్లా

**డ్రైవింగ్ లైసెన్స్**

రాష్ట్రంలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ఇకపై ఆన్లైన్ పరీక్షలో ఉత్తీర్ణత కావలసి ఉంటుంది. ఈ విధానం ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి వస్తుందని రవాణా శాఖ ప్రకటించింది. LLR కు దరఖాస్తు చేసే ముందే అభ్యర్థులు ఆన్లైన్లో రోడ్డు భద్రత కు సంబంధించిన పాఠాలు విని పరీక్ష రాయాలి. ఇందులో ఉత్తీర్ణులై, సర్టిఫికెట్ నెంబర్ పొందిన తరువాతనే LLR స్లాట్ బుక్ చేసుకోవాలి.

........డెస్క్

**స్కిల్ యూనివర్సిటీ**

రాష్ట్రంలో కొత్తగా నెలకొల్పిన నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిని విస్తరించి దాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్ని

కళాశాలలతో పాటు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు వస్తాయి. ఇప్పటిదాకా ఈ విశ్వవిద్యాలయం ఐటి, పరిశ్రమల శాఖ పరిధిలో ఉండగా ఇకపై ఉన్నత విద్యాశాఖ ఈ యూనివర్సిటీని పర్యవేక్షిస్తుంది. ఈ స్కిల్ యూనివర్సిటీని 2024 ఆగస్టులో నెలకొల్పారు. రాష్ట్ర చట్టం ద్వారా పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో దీనిని ఏర్పాటు చేశారు. దీనికి ఛాన్సలర్ గా ముఖ్యమంత్రిగా, బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ గా మహేంద్ర గ్రూప్ ఛైర్మన్ గా కొనసాగుతున్నారు.

....డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో ఈరోజు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. పెద్దపల్లి, భూపాల్ పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూలు జిల్లాలకు ఎల్లో ఎలెర్ట్ జారీ చేసింది.

......ప్రెస్ నోట్

**లైఫ్ టాక్స్**

అదనపు వాహనాలు కొనుగోలు చేసే వారికి విధించే రెండు శాతం లైఫ్ టాక్స్ ను రేపటి నుంచి రద్దు చేస్తున్నట్లు రవాణా శాఖ ప్రకటించింది. కాగా, వాహన్ పోర్టల్ ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రేపు ప్రారంభిస్తారు. దేశంలో ఉన్న అన్ని వాహనాల వివరాలు ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి వస్తాయి.

........డెస్క్

**అంగన్వాడీలు**

రాష్ట్రంలో అంగన్వాడీలకు కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 38 వేల పైగా కొత్త ఫోన్లను కొనుగోలు చేశారు. అంగన్వాడీ టీచర్ ప్రతిరోజు మొబైల్ లో పోషణ్ ట్రాకర్ యాప్ లో 14 రకాల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

డెస్క్

**బీజేపీ సిద్ధాంతాలు**

దేశం ముందు, కుటుంబం తరువాత అనే నినాదంతో బిజెపి ముందడుగు వేస్తున్నదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీ గా బీజేపీ అవతరించిందని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా శివారులోని నాగులపల్లిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ - 2026 ఉమ్మడి తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రశిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

SANGAREDDY. PTC